క్లుప్తంగా

రేపు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొడంగల్: పట్టణంలోని ప్రాచ్య కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఈ నెల 7న నిర్వహించనున్నట్లు భువనగిరి డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ టి.మల్లారెడ్డి తెలిపారు. కొడంగల్‌లోని ఓరియంటల్ కళాశాలలో చదువుకుని, విధి నిర్వాహణలో భాగంగా ఎక్కడెక్కడో స్థిర పడిన వారందరితో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. అందుకోసం స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మంటపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆచార్యులు శ్రీమాన్ ధరూరి శ్రీనివాసాచార్యులకు గురు పూజోత్సవం జరపనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, కళాశాల అభిమానులు, ఆత్మీయులు అందరూ పాల్గొనాలని కోరారు.

హైమాస్ట్ లైట్లకు మరమ్మతు చేయించండి

కుల్కచర్ల: కూడలిలో ఉన్న హైమాస్ట్ విద్యుత్ దీపాలను మరమ్మతు చేయించాలని వార్డు సభ్యులు మోత్కూరు వెంకటేశ్, కాటనిపల్లి మైపాల్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీపీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. ప్రధాన చౌరస్తాలోని హైమాస్ట్ లైట్లు వెలగక రాత్రి పూట అంధకారం నెలకొంటుందన్నారు. చీకటిగా ఉండటం వలన సీసీ కెమెరాలు పనిచేయని పరిస్థితి ఉందన్నారు. వెంటనే వాటికి మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, గొల్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

వ్యాపారికి పరామర్శ



ముజీబ్‌ఖాన్‌ను పరామర్శిస్తున్న అజారుద్దీన్

తాండూరు టౌన్: పట్టణానికి చెందిన ప్రముఖ బిల్డర్ ముజీబ్‌ఖాన్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్ పరామర్శించారు. కొద్ది రోజుల క్రితం ముజీబ్ కిందపడటంతో ఆయన కుడికాలు విరిగింది. విషయం తెలుసుకున్న ఆయన శుక్రవారం హైదరాబాద్ అమీర్‌పేట్‌లోని ఆయన నివాసానికి వెళ్లి క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు.


చామంతి 'సిరులు'



పూలను సేకరిస్తున్న కూలీలు

ధారూరు: చామంతి (పసుపు, తెలుపు)పూలకు డిమాండ్ పెరిగింది. సాగు తగ్గడంతో మార్కెట్లో హాట్‌కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. కిలో పూలకు రూ.60 నుంచి రూ.80 వరకు ధర పలుకుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. గతేడాది పూలసాగు రైతులను నిరాశపరిచిన నేపథ్యంలో ఆ ప్రభావం చామంతి కొరతకు దారితీసింది. చాలా మంది రైతులు పూల సాగుకు దూరంగా ఉండగా.. కొందరు ధైర్యం చేసి పండించారు. ఇప్పుడు అదే వారికి లాభాలను తెచ్చిపెడుతోంది. దిగుబడిని మార్కెట్లోకి తీసుకెళ్లిన వెంటనే విక్రయాలు జోరందుకోవడం, ఆశించిన మేర లాభాలు రావడంతో రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ఏ రోజు పూలను ఆరోజు కోపించి మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. ధారూరు మండల పరిధి కొండాపూర్‌ఖుర్దు, కేరెళ్లిలో రైతులు ఈ పూల సాగుకు మొగ్గుచూపుతున్నారు.

బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించాలి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతగిరి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు రద్దు చేసి, బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించాలని భారత్ ముక్తి మోర్చా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింద్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏఓ అమరేంద్ర కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఇదే డిమాండ్‌తో ఈ నెల 31న కేంద్ర ఎన్నికల కమిషన్‌ను లక్షలాది మందితో ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సూర్య నాయక్, రవీందర్ నాయక్, అరుణ్‌నాయక్ పాల్గొన్నారు.



కొడంగల్: రుద్రారంలో దరఖాస్తులు తీసుకుంటున్న తహసీల్దార్ విజయకుమార్



ధారూరు: చింతకుంటలో మాట్లాడుతున్న తహసీల్దార్ భువనేశ్వర్



దౌల్తాబాద్: నర్సాపూర్‌లో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శంకర్

సుపరిపాలనకు కట్టుబడి ఉన్నాం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోండి
- అభయ హస్తంలో ప్రజాప్రతినిధులు
- నేటితో ముగియనున్న గ్రామసభలు



తాండూరు టౌన్: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు టౌన్: ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమని, ప్రజలకు సుపరిపాలన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. ప్రజాపాలనలో భాగంగా పట్టణంలోని శుక్రవారం 31,32,33 వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం ఒక్కొక్కటిగా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని, అర్హులందరికీ గ్యారంటీలు దక్కేలా కృషి చేస్తానన్నారు. నేటితో గ్రామసభ ముగియనుందని, త్వరలోనే పథకాలు అమలు అవుతాయని స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకు వచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందడుగు వేశారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆర్డీఓ శ్రీనివాస్, కౌన్సిలర్లు లావణ్య, ప్రభాకర్ గౌడ్, నాయకులు డాక్టర్ సంపత్, హబీబ్ లాలా తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందుతాయని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, తహసీల్దార్ విజయకుమార్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధి రుద్రారం పాటిమీదిపల్లి బోయపల్లితండాలో నిర్వహించిన ప్రజాపాలనలో తహసీల్దార్.. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మున్సిపల్ పరిధి 10, 11 వార్డు కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్.. స్థానికుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని మండల ప్రత్యేకాధికారి శంకర్ అన్నారు. మండలంలోని కౌడీడ్, బిచ్చాల, నర్సాపూర్ గ్రామాల్లో ప్రజాపాలనను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. అధికారులు ప్రతి దరఖాస్తును పరిశీలించి రసీదు ఇవ్వాలని సూచించారు. తహసీల్దారు విజయ్‌కుమార్, ఎంపీడీఓ తిరుమలస్వామి, ఎంపీఓ రవీందర్ ఉన్నారు.

పెద్దేముల్‌లో 12, 596 అర్జీలు

పెద్దేముల్: మండల పరిధి బండమీదిలపల్లి, జైరాంతండా, ఓంలానాయక్‌తండా, పాషాపూర్, ఉరేంటితండాల్లో నిర్వహించిన ప్రజాపాలనలో అధికారులు అర్జీలను స్వీకరించారు. గత నెల 28 నుంచి కొనసాగుతున్న కార్యక్రమంలో మండలంలోని 37 గ్రామాల్లో మొత్తం 12వేల 596 అర్జీలను ప్రజల నుంచి తీసుకున్నామని ఎంపీడీఓ లక్ష్మప్ప, తహసీల్దార్ కిషన్‌లు తెలిపారు. సర్పంచ్‌లు జైరాం నాయక్, భరత్, టోప్యానాయక్, తులసి, జమిలి బాయి, రుక్కుబాయి, ఏఓ నజీరొద్దీన్, ఆర్ఐ రాజీరెడ్డి, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల ఏఈలు సందీప్‌కుమార్, రాములు, సిద్దార్థ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వాణి, మీనాక్షి, పీఓ నర్సింహులు, ఏఈఓ బాల కోటయ్య, స్వాతి, వినయ్, జీపీ కార్యదర్శులు రమేష్, శ్రావణ్, రాజు, అరుణ, సుమలత, అర్చన, సుశీల, గోపాల్, భాస్కర్‌గౌడ్, మహేశ్‌గౌడ్, నరేష్, ఉపాధిహామీ టీఏలు అంజిలయ్య, మల్లేశం గౌడ్, ప్రవీణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పైరవీలకు తావులేకుండా..

యాలాల: పైరవీలకు తావులేకుండా సంక్షేమ పథకాల అమలుకు చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. యాలాల మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలనలో అర్హుల నుంచి నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం మాట్లాడారు. ఎవరి ప్రమేయం లేకుండా.. నేరుగా ప్రజల నుంచి అర్జీలను తీసకునేలా ఆదేశాలు ఇచ్చామని, ఎవరు కూడా ఆందోళన చెందకుండా, గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, మాజీ అధ్యక్షుడు భీమప్ప, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి, హన్మంతు, మహిపాల్, మైనోద్దీన్, నాగప్ప ఉన్నారు.

రాష్ట్రంలో మళ్లీ ఇందిరమ్మ రాజ్యం

బంట్వారం: అర్హులకు ఆరు గ్యారంటీలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం కోట్‌పల్లి, లింగంపల్లిలో నిర్వహించిన ప్రజాపాలనలో పలువురి నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే పేద ప్రజలకు మేలు జరుగుతుందని, రాష్ట్రంలో మళ్లీ ఇందిరమ్మ రాజ్యం వస్తుందన్నారు. అనంతరం కోట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. మనఊరు మనబడి పనులపై ఆరా తీశారు. కార్యక్రమంలో పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్, తహసీల్దార్ ఆశాజ్యోతి, ప్రత్యేక అధికారి రాజేశ్వర్, ఎంఈఓ చంద్రప్ప, కోట్‌పల్లి, లింగంపల్లి సర్పంచ్‌లు విజయలక్ష్మి, చంద్రకళ, మాజీ జెడ్పీటీసీ అంజయ్య, మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షుడు నక్కల బందెయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ శివానందం తదితరులు పాల్గొన్నారు.

ధారూరులో.. 11,205

ధారూరు: అర్హులందరూ ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ భువనేశ్వర్ సూచించారు. మండల పరిధి చింతకుంటలో నిర్వహించిన ప్రజాపాలనలో పలు అర్జీలను స్వీకరించి మాట్లాడారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారు సభలకు రాకున్నా, తర్వాత జీపీ కార్యదర్శులకు దరఖాస్తులు అందజేయవచ్చని సూచించారు. ఇప్పటి వరకు మండల పరిధి 28 గ్రామాల్లో 9,901 కుటుంబాల నుంచి 11,205 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. శుక్రవారం మైలారం, కుమ్మర్‌పల్లి, చింతకుంట, హరిదాస్‌పల్లిలో గ్రామసభల్లో 1,050 కుటుంబాల నుంచి ప్రజలు 1,503 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి, ఎంపీఓ శఫీఉల్లా, ప్రజలు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసేందుకే ప్రభుత్వం ప్రజాపాలన చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకుడు సుభాష్‌యాదవ్‌లు అన్నారు. మండల పరిధి కోట్‌మర్పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ గణేశ్ అర్జీలను స్వీకరించారు. పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, సర్పంచ్ విజయలక్ష్మి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి నికిల్ రెడ్డి, ఎంపీటీసీ సుజాత, మల్లేశ్‌యాదవ్, శేఖర్ యాదవ్, అనంత్‌రెడ్డి ఉన్నారు.



పెద్దేముల్: జైరాంతండాల్లో అర్జీలు తీసుకుంటున్న అధికారులు



కొడంగల్‌లో.. మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి



కోట్‌మర్పల్లిలో.. అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ గణేశ్

నాలుగు నెలల తర్వాత మళ్లీ ప్రజాపాలన

మండల ప్రత్యేకాధికారి చరితారెడ్డి

మోమిన్‌పేట: అర్హులకు ఆరు గ్యారంటీలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మండల ప్రత్యేకాధికారి చరితారెడ్డి అన్నారు. మండల పరిధి బాల్‌రెడ్డిగూడెం, చీమల్‌దరి, ఇజ్రా చిట్టంపల్లి, సయ్యద్‌అల్లిపూర్ గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలనలో ఆమె మాట్లాడారు. అర్హులందరూ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే రైతు బంధు, పింఛన్ వస్తున్న వారు అర్జీ పెట్టుకోవాల్సిన అవసరం లేదని, ఆ రెండు పథకాలు వస్తున్న లబ్ధిదారులు మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి తదితర వాటికి మాత్రమే అప్లై చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత దరఖాస్తుల్లో లబ్ధిచేకూరకపోతే అర్హులం కావేమో అన్న భయాందోళనకు గురి కావద్దని, నాలుగు నెలల తర్వాత మళ్లీ ప్రజాపాలన నిర్వహించనున్నట్లు ప్రభుత్వం పేర్కొన్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు చంద్రకళ, నాసన్‌పల్లి నర్సింహ్మారెడ్డి, కాశీరాం, సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి, ఎంపీడీఓ శైలజారెడ్డి, ఏపీఎం రాజు, ఏపీఓ శంకర్, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అర్హుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి చరితారెడ్డి

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్



దరఖాస్తులు స్వీకరిస్తున్న రవిగౌడ్

తాండూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్, ఎల్మకన్నె సొసైటీ చైర్మన్ సంగెం రవిగౌడ్ అన్నారు. మండల పరిధిలోని సిరిగిరిపేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పలువురి నుంచి అర్జీలను స్వీకరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లో రెండు గ్యారంటీలను అమలు చేసిందని పేర్కొన్నారు. అర్హులందరూ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, సర్పంచ్ రాధిక, ఎంపీటీసీ సుశీల, ఎంపీఓ రతన్‌సింగ్, ఏఓ రజిత నాయకులు అంబ్రేష్, వెంకటప్పలు ఉన్నారు.

తాగునీటి వృథాను అరికట్టండి

పెద్దేముల్: పగిలిన తాగునీటి పైపు లైనును మరమ్మతు చేయించి, నీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామ పంచాయతీ, మండల కార్యాలయానికి వెళ్లే మార్గం, జగ్జీవన్‌రామ్ వెనుక భాగంలో తాగునీటి పైపు పగిలి నీరు వృథాగా పోవటమే కాకుండా.. కలుషితం అవుతున్నాయని స్థానికులు చెప్పారు. పది రోజులుగా లీకేజీ అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే స్పందించి మరమ్మతు చేయించాలని కోరారు. ఇదే విషయమై ఎంపీడీఓను వివరణ కోరగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా ప్రారంభమైన ఎల్లమ్మ జాతర

యాలాల: మండలంలోని ముద్దాయిపేట రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సిడే ఊరేగింపును నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు, భక్తుల సమక్షంలో సిడేకు పూజలు చేసి, ఆలయం చుట్టూ తిప్పారు. అనంతరం భక్తులు పూజాకార్యక్రమంలో పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం సాయంత్రం ఉత్సవాల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు ఎమ్మెల్యేను సన్మానించారు.

క్రీడలతో శారీరక దృఢత్వం



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న బాల్‌రెడ్డి

కుల్కచర్ల: క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగు పడతాయని పాంబండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుమ్మరి స్వామి, దామోదర్ రెడ్డిలు అన్నారు. శుక్రవారం మండల పరిధి బండవెల్కిచర్ల గ్రామంలో జిల్లాస్థాయి ఓపెన్ టు ఆల్ క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యువత క్రీడల్లో పాల్గొనడం వలన స్నేహభావంతో పాటు శారీరకంగా దృఢంగా ఉంటారని తెలిపారు. అదే విధంగా ఓపిక, సహనం, ఆలోచన విధానాలు పెరుగుతాయని పేర్కొన్నారు. జోగు వెంకటయ్య, బచ్చిరెడ్డి, శ్రీనివాస్, రాములు, రవిలాల్, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అనంతగిరి: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని పలు వార్డుల్లో చేపట్టిన ప్రజాపాలనలో అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా గాంధీ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీ పథకాల అమలు కోసం అర్జీలను స్వీకరిస్తుందని తెలిపారు. నేటితో దరఖాస్తుల ప్రక్రియ పూర్తి కావస్తున్నందున.. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మోముల స్వాతి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, వార్డు అధికారి గోపాల్, నాయకులు రాజ్‌కుమార్, ప్రదీప్, సందీప్, సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్

- విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు కృషి
- మండల విద్యాధికారి హరిశ్చందర్

దోమ: విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ అని, బాధ్యతతో విధులను నిర్వహించి, వారిని తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు ఎంఈఓ హరిశ్చందర్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి ప్రోగ్రాంలపై ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. చదవడం, రాయడంతో పాటు గణిత సామర్థ్యాలను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎఫ్ఎల్ఎన్, ఉన్నత ప్రోగ్రాంలను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో బొంపల్లి, దోమ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకట్, రాములు, కాంప్లెక్స్ సెక్రటరీ ఎండీ షఫీ, జయరాం, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దోమ: మాట్లాడుతున్న కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకట్

విద్యాప్రమాణాల పెంపునకు తొలిమెట్టు

దౌల్తాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యాప్రమాణాలను ప్రణాళికాబద్ధంగా పెంచేందుకు తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేయాలని ఎంఈఓ రామ్‌మస్తా అన్నారు. శుక్రవారం మండల కేంద్రం ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రైమరీ స్థాయి నుంచే విద్యాప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించిందని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఊషన్న, సీఆర్‌పీ నారాయణ ఉన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతల వితరణ

ఘనంగా రాముడి విగ్రహం ఊరేగింపు

దోమ: శతాబ్దాల అనంతరం రామమందిరం కల నెరవేరిందని, ఈ నెల 22న జరిగే బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం హిందూ సమాజానికి గొప్ప పర్వదినమని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధి శివారెడ్డిపల్లి గ్రామంలో శ్రీరాముడి విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం రామమందిరం నుంచి వచ్చిన రాముడి అక్షింతలను ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించి, గ్రామస్తులకు పంపిణీ చేశారు. రామాలయ ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో ఇంటింటికీ అక్షింతలు చేరేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీకాంత్‌రెడ్డి, అర్జున్ రెడ్డి, గిరి, విక్రమ్, సురేందర్‌రెడ్డి, రామలింగం, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శాంతయ్య, భీమయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: అయోధ్య రామమందిర ప్రారంభోత్సవ నేపథ్యంలో రాముడిని అభిషేకించిన అక్షింతలను దేశ నలుమూలలా పంపిణీ చేస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు మండల పరిధి గ్రామాల్లో ఇంటింటికీ రాములోరి అక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సౌమ్యారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కాంగారి ఆంజనేయులు, చాకలి శ్రీనివాస్, శేఖర్, సంతోష్, మోత్కూరు వెంకటేశ్, వెంకట్ రెడ్డి, గుడాల వెంకటయ్య, మైపాల్, రాజేశ్వర్, రాజు, శ్రీకాంత్, చంద్రకాంత్, చందు, సంగప్ప, వీరేషం, కాశీనాథ్, మణికంఠ, చంద్రలింగం, కృష్ణయ్య, సంగప్ప తదితరులు పాల్గొన్నారు.



దోమ: శివారెడ్డిపల్లిలో శ్రీరాముడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు

ఇంగ్లిష్ రీడింగ్ స్కిల్స్ పెంచుకోవాలి

షాబాద్: ఇంగ్లిష్ పుస్తకాలతో విద్యార్థులు రీడింగ్ స్కిల్స్ పెంచుకోవాలని ఆకృతి ప్రాజెక్ట్ లీడ్స్ శ్రీనివాస్, సద్దాం హుస్సేన్ సూచించారు. శుక్రవారం షాబాద్ మండల పరిధి పటేల్‌గూడ, తిర్మలాపూర్, కేసారం, కొమరబండ, ఎల్గొండగూడ, కేశవగూడ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఇంగ్లిష్ లైబ్రరీ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇంగ్లిష్ లైబ్రరీ పుస్తకాలను చదవడం ద్వారా రీడింగ్ స్కిల్స్ పెంచుకుంటారని తెలిపారు. ఆకృతి ప్రాజెక్టు ద్వారా విద్యార్థులకు బోధించేందుకు సుధారాణి అనే ఉపాధ్యాయురాలిని నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పటేల్‌గూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ప్రాజెక్ట్ ఫీల్డ్ ఆఫీసర్లు భిక్షపతి, అమీర్, పవిత్ర, రామకృష్ణ, నవిత, సంతోశ్ ఉన్నారు.

కులవృత్తి దారులకు రుణాలు

- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలి
- యూనియన్ బ్యాంకు మేనేజర్ ప్రశాంత్ మిశ్ర

మర్పల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంకు మర్పల్లి శాఖ మేనేజర్ ప్రశాంత్ మిశ్ర సూచించారు. శనివారం మండల పరిధి తిమ్మాపూర్, రావులపల్లి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేనేజర్ మాట్లాడారు. నిరు పేదల ఆర్థికాభివృద్ధికి కేంద్రం, అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అవగాహన లేమీతో గ్రామీణ ప్రాంత ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోలేక పోతున్నారని పేర్కొన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తోందని వెల్లడించారు. కులవృత్తుల జీవన స్థితిగతులను మెరుగు పర్చేందుకు కేంద్రం.. బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందిస్తుందని తెలిపారు. అర్హులైన వారు బ్యాంకులో వివరాలు తెలుసుకొని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శేఖర్, అబ్రహం, బ్యాంకు ఖాతాదారులు తదితరులు ఉన్నారు. ఉజ్వల గ్యాస్ పథకం నిర్వాహకులతో పాటు బ్యాంకు మిత్రలు తుల్జారామ్, నర్సింహులు గ్రామస్తులు పాల్గొన్నారు

'జమియత్' సేవలు హర్షణీయం

- ఇమామ్, మౌజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాండూరు టౌన్: జమియత్ ఉలేమా–ఎ–హింద్ సంస్థ చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు హర్షణీయమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లో ఆ సంస్థ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. దేశ ప్రయోజనాల కోసం సంస్థ చేస్తున్న సేవలు అనిర్వచనీయమన్నారు. మత, సామాజిక సేవా రంగాల్లో ప్రభుత్వ సాయం సైతం తప్పకుండా సంస్థకు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా ఇమామ్‌లు, మౌజ్‌ల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని పేర్కొన్నారు. అనంతరం జమియత్ జిల్లా అధ్యక్షుడు మౌలానా మహ్మద్ అబ్దుల్లా అజహర్ ఖాస్మీ మాట్లాడుతూ.. దేశ, జాతి ప్రయోజనాలే సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. నూతన ప్రభుత్వం ప్రజారంజక పాలన అందజేయాలని, వారి సంక్షేమానికి కృషి చేయాలని సంస్థ తరుపున కోరుతున్నట్లు చెప్పారు. ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ తాండూరు అధ్యక్షుడు కమాల్ అతర్, సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రహ్మాన్ అతర్ ఖాస్మీ, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్, ధారాసింగ్, హబీబ్ లాలా, అబ్దుల్ అమీర్ ఉన్నారు.